
సాక్షి నంద్యాల

ఆదివారం । 16 ఏప్రిల్ । 2023



నాటక కళల కాణాచి

నాటక కళల కాణాచిగా కందనవోలు పేరుగాంచింది. జిల్లాలోని పలువురు కళాకారులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చి రంగస్థలాన్ని సుసంపన్నం చేశారు.

10లో▸



మద్దిలేటయ్య క్షేత్రం కిటకిట

బేతంచెర్ల: మద్దిలేటయ్య క్షేత్రం శనివారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. చైత్ర మాసం సందర్భంగా భక్తులు తరలివచ్చారు. వివిధ సేవా టికెట్ల ద్వారా రూ. రూ.8.67 లక్షల ఆదాయం వచ్చింది.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన నరసింహన్ శనివారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు. దాతకు ఆలయ విరాళాల బాండును అందజేశారు.



	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:38	ఉ॥ 4:38
ఆదోని	సా॥ 6:41	ఉ॥ 4:41
నంద్యాల	సా॥ 6:38	ఉ॥ 4:41
ఆత్మకూరు	సా॥ 6:36	ఉ॥ 4:35
బనగానపల్లె	సా॥ 6:41	ఉ॥ 4:35

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :

తల్లిదండ్రులను గౌరవించండి. వృద్ధాప్యంలో అన్ని విధాలా అండగా ఉండండి. వారిని నిర్లక్ష్యం చేస్తే స్వర్గంలో ప్రవేశం కష్టతరం.

– పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

ఓబులేశుడి వసంతోత్సవానికి అంకురార్పణ పూజలు



విష్వక్సేనుడిని మండపానికి తోడ్కొని వస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: శ్రీ లక్ష్మీ నారసింహుడి వసంతోత్సవాలకు శనివారం రాత్రి దిగువ అహోబిలంలో అంకురార్పణ జరిగింది. వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఉత్సవమూర్తి విష్వక్సేనుడిని ముస్తాబు చేసి పల్లకీలో కొలువుంచి ఆలయం వెలుపలకు తోడ్కొని వచ్చారు. అనంతరం ఆలయానికి ఈశాన్యం వైపు ఉన్న పుట్టకు పూజలు నిర్వహించి పుట్టమన్నును సేకరించి మండపం దగ్గరకు తీసుకువచ్చారు. అక్కడ అంకుర హోమం నిర్వహించి సోముడిని (చంద్రుడిని) మట్టిలోకి ఆవాహం చేశారు. పాత్రలో మట్టిలో నవధాన్యాలను పోసి సోమకుంభ స్థాపన చేశారు.

కేసీ కెనాల్‌కు నిలిచిన నీటి సరఫరా



కేసీ కెనాల్‌లో నీరు లేని దృశ్యం

జూపాడుబంగ్లా: సుమారు తొమ్మిదినెలల అనంతరం కేసీ కాల్వకు సాగునీటి సరఫరా నిలిచిపోయింది. గతేడాది జూలై 15న ప్రారంభమైన సాగునీటి సరఫరా ఈ ఏడాది ఏప్రిల్ 10 వరకు కొనసాగగా ఖరీఫ్, రబీ పంటలకు పుష్కలంగా సాగునీరు అందింది. 2022–23 ఏడాదికి గాను 6.45 టీఎంసీల నీటిని కేటాయించగా వర్షాలు సమృద్ధిగా కురవడంతో నీటివాటాను 8.86 టీఎంసీలకు పెంచారు. సుంకేసుల నుంచి కేసీ కాల్వకు 31.3 టీఎంసీలు, మల్యాల ఎత్తిపోతలనుంచి 0.9 టీఎంసీలు, ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి 4.07 టీఎంసీల నీటిని కేసీ కాల్వకు సరఫరా చేసినట్లు అధికారులు తెలిపారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో కారు దగ్ధం




మంటల్లో దగ్ధమవుతున్న కారు

శ్రీశైలం: దోర్నాల – శ్రీశైలం ఘాట్ రోడ్డులో శనివారం సాయంత్రం ఓ కారు దగ్ధమైంది. స్వామి అమ్మ వార్ల దర్శనార్థమై విజయవాడ నుంచి వచ్చిన భక్తులు సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. తుమ్మలబైలు సమీపంలో కారు ఇంజిన్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు ఎగసిపడ్డాయి. కారులో ఉన్న నలుగురు భక్తులు భయంతో కిందకి దిగారు. నిమిషాల్లో కారుకు మొత్తం మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. దోర్నాల పోలీసులు కేసు నమోదు చేశారు.

భూమి భద్రం.. హక్కు సురక్షితం

- రెండో విడత భూ రక్ష సమగ్ర సర్వే ప్రారంభం
- జిల్లాలో 29 గ్రామాలు ఎంపిక
- 1.26 లక్షల ఎకరాల్లో సర్వే చేయనున్న వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

పల్లెల్లో దశాబ్దాలుగా పొలం గట్టు పంచాయితీలు జరుగుతూనే ఉన్నాయి. పొలం సరిహద్దుల కోసం గతంలో ఘర్షణలు, హత్యలు చోటు చేసుకున్న ఘటనలు జిల్లాలో ఎన్నో ఉన్నాయి. న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగిన బాధితులు ఉన్నారు. భూ సమస్య పరిష్కారానికి స్పందనలో అధిక అర్జీలు ఇవే ఉంటున్నాయి. వీటన్నింటికీ చెక్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకం సమగ్ర సర్వే కార్యక్రమం జిల్లాలో రెండో విడత ప్రారంభమైంది. సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేసి హక్కు పత్రాలు అందజేస్తుండటంతో రైతుల్లో ఆనందం నెలకొంది.



డ్రోన్ సర్వే ప్రతీకాత్మక చిత్రం

కొలిమిగుండ్ల: దశాబ్దాల తరబడి నెలకొన్న భూ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకం సమగ్ర సర్వే కార్యక్రమం జిల్లాలో రెండో విడత ప్రారంభమైంది. రైతుల పొలాలకు భద్రం కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే జిల్లాలో మొదటి విడత సమగ్ర సర్వే పూర్తయింది. పైలెట్ ప్రాజెక్ట్‌గా 11 గ్రామాల్లో 15,687.60 ఎకరాల్లో 4,718 ఎకరాల్లో సర్వే చేసి సరిహద్దు రాళ్ల పాతి, భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. మొదటి విడత విజయవంతం కావడంతో రెండో విడత కూడా చేపట్టారు. బ్రిటిష్ కాలంలో 1905 నుంచి 1930 వరకు గ్రామాల్లో వ్యవసాయ భూములను సర్వే చేసి ఆర్‌ఎస్‌ఆర్ రికార్డులను రూపొందించారు. ఆ తర్వాత ఇప్పటి వరకు భూముల రీసర్వే జరగలేదు. అప్పటి రికార్డుల ఆధారంగానే రైతులకు భూహక్కు కల్పిస్తున్నారు. భూముల సర్వే జరిగి దాదాపు వందేళ్లు కావడంతో ఎన్నో మార్పులు చోటు చేసుకొని, భూ వివాదాలు ఏటా పెరిగిపోతున్నాయి. భవిష్యత్‌లో సైతం రైతులకు భూవివాదాలు తలెత్తకూడదనే ఉద్దేశంతో రీసర్వే చేసి క్యూఆర్ కోడ్‌తో కూడిన హక్కు పత్రాలను అందించనున్నారు. మూడు దశలో చేపట్టనున్న భూముల రీసర్వే జిల్లాలో ప్రస్తుతం ఫేజ్–2లో భాగంగా సర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లాలోని 11 మండలాలోని 29 రెవెన్యూ గ్రామాల్లో సర్వే, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో సమగ్ర సర్వే పనులు జరుగుతున్నాయి. సర్వేకు ఆధునిక పరికరాలతో డ్రోన్ రోవర్ ఉపయోగిస్తున్నారు. డ్రోన్ ఫ్లై ఆర్థోరెటిఫైడ్ ఇమేజెస్ ప్రక్రియ చేపట్టారు. సర్వేను వేగవంతం చేసి రైతులకు ఉచితంగా సరిహద్దు రాళ్లు పాతిస్తోంది. జిల్లాలో కొలిమిగుండ్ల, అవుకు, బనగా నపల్లె, బేతంచెర్ల, ఆళ్లగడ్డ, చాగలమర్రి, రుద్రవరం, దొర్నిపాడు, బండిఆత్మకూరు, వెలుగోడు, మిడుతూరు మండలాల్లో 10,2613.14 ఎకరాల్లో సర్వే పూర్తి చేసి 4,4710 మంది రైతులకు శాశ్వత భూహక్కు–భూరక్ష పత్రాలు అందించనున్నారు.



కొలిమిగుండ్ల మండలం హనుమంతుగుండంలో రీసర్వే చేస్తున్న అధికారులు

భూ వివాదాలకు చెక్

గ్రామాల్లో వ్యవసాయ, గ్రామ కంఠం, ప్రయివేట్ భూములను ప్రభుత్వం ఉచితంగా సర్వే చేసి కచ్చితమైన విస్తరణతో భూముల సరిహద్దులను ఏర్పాటు చేస్తుండటంతో భూ వివాదాలు పరిష్కారం కానున్నాయి. ఏళ్ల నాటి భూ రికార్డులు పాడైపోవడం, కచ్చితమైన విస్తీర్ణం లేక రైతుల మధ్య తరచూ భూ వివాదాలు ఏర్పడుతుండేవి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భూముల భూ రక్ష – భూహక్కు కింద సమగ్ర సర్వే పూర్తిగా ఉచితంగా చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా సమగ్ర సర్వే



జిల్లాలో ఫేజ్–2 సమగ్ర సర్వే ముమ్మరంగా సాగుతోంది. 1.26 లక్షల ఎకరాల్లో సర్వే లక్ష్యంగా పనులు ప్రారంభించాం. ప్రక్రియ పూర్తి కాగానే సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేసి రైతులకు భూహక్కు పత్రాలు అందిస్తాం. సర్వే కోసం ఆధునిక పరికరాలు ఉపయోగిస్తున్నాం. ఈ సర్వేతో రైతులకు చాలా మేలు జరుగుతుంది.

– శ్రీరాంమోహన్, సర్వేశాఖ అసిస్టెంట్ డైరక్టర్

భవిష్యత్‌లో భూ సమస్యలు ఉండవు



తరతరాలుగా వస్తున్న భూ ఆస్తిని భవిష్యత్ తరానికి భద్రంగా ఇచ్చేందుకు భూ సర్వే ఎంతో తోడ్పతుంది. చాలా గ్రామాల్లో కొలతల్లో తేడాలు, రికార్డుల్లో తప్పులు దొర్లడంతో రైతులు ఎన్నో ఏళ్లుగా సరిహద్దు సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ సర్వేతో భవిష్యత్‌లో భూ వివాదాలు ఉండవు. మూడు రోజుల క్రితం మా గ్రామంలో 15 మంది రైతుల పొలాలను ప్రభుత్వమే ఉచితంగా సర్వే చేసింది. సరిహద్దు రాళ్లను కూడా పాతిస్తుండటం మంచి పరిణామం.

– కృష్ణమూర్తి, రైతు, హనుమంతుగుండం

జిల్లాలో ఫేజ్–2 కింద చేపట్టిన సమగ్ర సర్వే వివరాలు

గ్రామం	రైతులు	ఎకరాలు
మీర్జాపురం	287	1,204.33
హనుమంతుగుండం	1,722	4,164.89
బితాడిపత్రి	1,729	3,086.50
అహోబిలం	397	3,334.74
బాచేపల్లి	1,286	3,800.21
మిట్టపల్లె	749	5,966.85
చిన్నవంగలి	515	1,541.08
పెద్దవంగలి	986	2,080.28
డి.వనిపెంట	1,145	4,695.39
ముత్యాలపాడు	2,730	6,469.93
టి.లింగందిన్నె	1,472	3,992.58
శ్రీరంగాపురం	1,150	2,838.39
గుండుపాపల	682	2,044.22
కొండాపురం	593	1,172.35
డబ్ల్యూ.గోవిందిన్నె	2,637	8,028.38
యర్రగుంట్ల	2,324	2,517.52
పార్నపల్లె	1,640	3,449.97
అబ్దులాపురం	2,123	2,234.57
బోయరేవుల	3,947	4,584.93
గుంతకందాల	2,403	2,343.87
చింతలపల్లి	1,859	4,228.66
అలగనూరు	1,410	4,870.34
జలకనూరు	3,075	4,496.89
బత్తులూరుపాడు	608	566.80
పండ్లాపురం	1,234	1,930.93
నిలువుగండ్ల	685	1501.74
ఎస్.రంగాపురం	2,896	9,591.11
నిచ్చెనమెట్ల	1,176	2,675.54
శివవరం	1,250	3,200.25

టీడీపీ నేతలకు అభివృద్ధి కనిపించదు

- చంద్రబాబు, లోకేశ్‌ను ప్రజలు నమ్మరు
- సీఎం జగన్ తోడ్పాటుతో ఆదర్శ నియోజకవర్గంగా డోన్
- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

బేతంచెర్ల: 'డోన్ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. విద్య, వైద్య, తాగునీరు సౌకర్యాలు కల్పించడంతో పాటు రహదారులు, ఆలయాలు, కళాశాలల నిర్మాణానికి ఎంతో కృషి చేస్తున్నాం. 30 ఏళ్లలో నోచుకోని అభివృద్ధి నాలుగేళ్లలో చేశాం. టీడీపీ నేతలకు మాత్రం ఎక్కడా అభివృద్ధి కనిపించదు' అంటూ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. శనివారం మండలపరిధిలోని సీతారామాపురం గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గ్రామ సర్పంచ్ చిట్టి వేణుగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ సుబ్బమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మంత్రి బుగ్గన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోడ్పాటుతో డోన్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా ఉద్దానం, వైఎస్సార్ జిల్లా పులివెందుల, నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో వాటర్ గ్రిడ్ పథకం కింద శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సమస్య పరిష్కారానికి సీఎం నిధులు మంజూరు చేశారన్నారు. అందులో భాగంగా గోరుకల్లు రిజర్వాయర్ నుంచి డోన్ నియోజకవర్గంలో ఇంటింటికి శుద్ధమైన నీరు అందించేందు రూ.330 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. జూలై నాటికి బేతంచెర్ల, డిసెంబర్ నాటికి డోన్, ప్యాపిలి మండలంలోని గ్రామాల్లో ఇంటింటికి శుద్ధమైన తాగునీరు 365 రోజులు అందిస్తామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు లోకేశ్‌ను ప్రజలు నమ్మరన్నారు. టీడీపీని వచ్చే ఎన్నికల్లో భూస్థాపితం చేస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, మద్దిలేటి స్వామి చైర్మన్ రామ చంద్రుడు వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు జయ ప్రకాశ్‌రెడ్డి, ఎంబాయి సర్పంచ్ యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పేదల సంక్షేమమే లక్ష్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి బుగ్గన

నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కర్నూలు రహదారిలోని సీతారామాపురం మెట్టు నుంచి గ్రామంలోకి 3.8 కిలోమీటర్లు రూ.2.80 కోట్ల పీఆర్ ఆర్ (ప్లైన్) నిధులతో పూర్తయిన డబుల్ లేన్ రహదారిని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రజలు, వైఎస్సార్ నాయకులు, కార్యకర్తలతో కలిసి రహదారి వెంట మంత్రి పాదయాత్ర చేశారు. రహదారి వెంట ఆయా గ్రామాల ప్రజల సమస్యలు వింటూ ముందుకు సాగారు. అనంతరం గ్రామంలోని శిలాఫలకాన్ని ఆవిష్కరించి, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం నెరవేర్చుతున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు గిమ్ముక్కులు చేసి ప్రజలను మోసం చేసిందన్నారు. గ్రామీణ రహదారుల అభివృద్ధే ధ్యేయంగా డోన్–బేతంచెర్ల, సిమెంట్ నగర్–తమ్మరాజుపల్లె డబుల్ లేన్ రహదారి నిర్మాణం పూర్తయిందన్నారు. అలాగే బేతంచెర్ల – వెల్దుర్తి వరకు డబుల్ రహదారి పనులు కొనసాగుతున్నాయని, ప్రతి ఒక్క గ్రామానికి రహదారి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ రామకృష్ణారెడ్డి, డీఈ నాగిరెడ్డి, ఏఈ గణేష్, వైకేపీ ఏపీఎం లింగమయ్య, ఈఓఆర్డీ వెంకట రంగ నాయకులు, ఏపీఓ శేషన్న, గ్రామ సర్పంచ్ చిట్టి వేణుగోపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దస్తగిరి, జయరామిరెడ్డి, రమణారెడ్డి, ఎద్దులన్న, యాకోబ్, వెంకటేష్ నాయ క్, నిరంజన్, తిరుమలేశ్వర్‌రెడ్డి, జయ ప్రకాశ్‌రెడ్డి ఆయా గ్రామాల సర్పంచ్‌లు శ్రీరాములు, గుమ్మగాల్ల రాజు, తిమ్మయ్య, యుగంధర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రామచంద్రారెడ్డి, రంగస్వామి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

- చివరి రోజు 254 మంది విద్యార్థులు గైర్హాజరు



కోవెలకుంట్లలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

నంద్యాల(సిటీ): జిల్లా పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంగా విధులు నిర్వహించడంతో పరీక్షలు సజావుగా ముగిశాయి. 125 కేంద్రాల్లో ఈ నెల 3వ తేదీన పరీక్షలు ప్రారంభం కాగా తెలుగు సెకండ్ లాంగ్వేజ్‌గా ఉన్న విద్యార్థులు శనివారం చివరగా సోషల్ స్టడీస్ పరీక్ష రాశారు. చివరి రోజు 254 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 22,979 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 22,543 మంది హాజరయ్యారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు అధికారులు మౌలిక వసతులు కల్పించారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్‌లకు తావు లేకుండా పటిష్ట బందోబస్తు నడుమ పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌లుగా ప్రకటించడంతో పాటు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, సిట్టింగ్ స్క్వాడ్లు బృందాలు పరీక్షకేంద్రాలను తనిఖీ చేశారు. ఈనెల 17వ తేదీ సోమవారం సెకండ్ లాంగ్వేజ్ సంస్కృతం ఉన్న విద్యార్థులు మాత్రమే పరీక్ష రాయనున్నారు.

రేషన్ పంపిణీపై ఫిర్యాదులు రాకూడదు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: రేషన్ కార్డుదారులకు సక్రమంగా బియ్యం సరఫరా చేసేలా శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఇళ్ల పట్టాల పంపిణీ, సివిల్ సప్లయ్, స్పందన గ్రీవెన్స్, రీ–సర్వే, కోర్టు కేసులు తదితర రెవెన్యూ అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో జాయింట్ కలెక్టర్ నిశాంతితో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ పంపిణీపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. చెంచు గూడెంలలోని అర్హులందరికీ రేషన్ కార్డులు ఇప్పించాలన్నారు. జిల్లాలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన నిరుపేదలందరికీ 90 రోజుల ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 2,540 దరఖాస్తులను ఈ నెలాఖరులోగా విచారించి జాబితాలో నమోదు చేయాలన్నారు. ప్రతి బీఎల్ఓ రిజిస్టర్ నిర్వహిస్తూ ఫార్మేట్ ప్రకారం వివరాలు సేకరించాలన్నారు. స్పందన కార్యక్రమంలో అధికంగా భూ తగాదా సమస్యలు, సివిల్ సప్లయ్స్, రెవెన్యూకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, అధికారులు స్పందన అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా గడువులోగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో సమగ్రజు సర్వేకు సంబంధించిన భూ సమస్యలు పెండింగ్ ఉండకూడదని, ఇందుకు సంబంధించి ల్యాండ్ అండ్ సర్వే ఏడీ తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్ఓ కామేశ్వర రావు, నంద్యాల, డోన్ ఆర్డీఓలు శ్రీనివాసులు, వెంకట రెడ్డి, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌లో బీటీ–2 పత్తి విత్తనాలు

- ఎమ్మిగనూరు కేంద్రంగా సాగుతున్న దందా
- ఎమ్మార్పీపై రూ.300 అదనంగా వసూలు

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాల జాడ లేకపోయినా బీటీ-2 పత్తి విత్తనాలకు డిమాండ్ ఏర్పడింది. ప్రధానంగా యుఎస్ 7067 రకం విత్తనాలు ఇప్పటి నుంచే బ్లాక్‌లో విక్రయిస్తుండటం గమనార్హం. గత ఏడాది కొన్ని రోజులు వర్షాభావం, మరికొన్ని రోజులు అధిక వర్షాలు, వాతావరణంలో మార్పులు తదితర కారణాలతో పత్తిలో దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. పలు బ్రాండెడ్ కంపెనీల విత్తనాలతో పత్తి సాగు చేసిన రైతులు నష్టాలు మూటకట్టుకున్నారు. యుఎస్-7067 బీటీ విత్తనాలతో పత్తి సాగు చేసిన రైతులు ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆశాజనకంగా దిగుబడులు సాధించారు. యుఎస్ అగ్రిసీడ్ కంపెనీకి కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం ప్రాంతాల్లో డిస్ట్రిబ్యూటర్లు(పంపిణీదారులు) ఉన్నారు. రైతుల ఆసక్తిని గమనించిన డీలర్లు బ్లాక్‌లో అమ్మకాలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఎమ్మిగనూరులో ఈ బ్లాక్ మార్కెట్ దందా ఎక్కువగా సాగుతోంది. ఎంఆర్‌పీ రూ.853 ఉండగా.. ఎమ్మిగనూరులో రూ.1000-1200 మధ్య విక్రయిస్తున్నారు. అయితే బిల్లు మాత్రం రూ.853కే ఇస్తున్నారు. అయితే వ్యవసాయ యంత్రాంగం పట్టించుకోకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ట్రాక్టర్ కింద పడి యువకుడి దుర్మరణం


నల్లమల (ఫైల్)

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం కానాల గ్రామ సమీపంలో శనివారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. గ్రామానికి చెందిన గుంతల నల్లమల (30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆరేళ్ల క్రితం బేతంచెర్ల మండలం కొత్తపేట గ్రామానికి చెందిన భూలక్ష్మితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. శనివారం ఉదయం నల్లమల గ్రామశివారులోని చెరువులో మట్టిని ట్రాక్టర్‌లో నింపుకుని పొలానికి వెళ్తుండగా పొలం రస్తాలో పెద్ద బండరాయిని ఎక్కించే క్రమంలో డ్రైవర్ సీటులో నుంచి జారి కింద పడ్డాడు. ఇంజిన్ వెనుక టైర్ తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రతాప్ పేర్కొన్నారు.



పరిశ్రమల స్థాపనలో యువతకు ప్రాధాన్యం

- స్థానిక వనరుల వివరాలపై విస్తృత ప్రచారం
- పల్లెల్లో యుద్ధప్రాతిపదికన నీటి ఎద్దడి నివారణ పనులు
- స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



సమావేశాల్లో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, హాజరైన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీలు

కర్నూలు(అర్బన్): పరిశ్రమల స్థాపనలో యువతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సూచించారు. జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో శనివారం స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఏ మండలంలో ఎలాంటి వనరులు ఉన్నాయనే వివరాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై స్థానిక యువతకు అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుపై ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసయాదవ్ చెప్పారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగం పెరగాల్సిన అవసరం ఉందని జెడ్పీ ఛైర్మన్ అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు ఉత్సాహం చూపుతున్న లబ్ధిదారులకు అవకాశం కల్పించాలన్నారు.

చెరువులను బలోపేతం చేయాలి

కేసీ కెనాల్ ఆయకట్టుకు ఏప్రిల్ 15వ తేదీ వరకు నీటిని అందించామని కేసీ కెనాల్ ఈఈ వీ తిరుమలేశ్వరరెడ్డి చెప్పడంపై ఛైర్మన్ పాపిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా 68 చెరువులకు నీటిని ఎప్పుడు నింపుతారని జెడ్పీ ఛైర్మన్ ప్రశ్నించారు. ఇప్పటికే దాదాపు 40 చెరువులకు పైగా ట్రయల్ రన్ పూర్తి అయ్యిందని, ప్రస్తుతం కెనాల్‌లో నీరు లేనందున సెప్టెంబర్ నెలలో చెరువులకు నీటిని నింపే అవకాశాలు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు చెప్పారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే రెండు జిల్లాల్లోని చెరువుల్లో వివిధ రకాల పనులు చేపట్టాలని ఛైర్మన్ సూచించారు. చెరువు కట్టలను బలోపేతం చేయడం, తూములకు మరమ్మతులు చేపట్టడం వంటి పనులను పూర్తి చేయాలన్నారు.

జగనన్న తోడు అద్భుత పథకం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న తోడు అద్భుతమైన పథకమని జెడ్పీ ఛైర్మన్ అన్నారు. ఈ పథకం కింద చిరు వ్యాపారులకు రూ.10 వేలు ఇవ్వడం వల్ల వారిని అధిక వడ్డీల బారి నుంచి తప్పించినట్లవుతుందన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరూ లబ్ధి పొందేలా పథకాన్ని విస్తృత పరచాలన్నారు. ఈ ఏడాది మార్చిలో కురిసిన వడగండ్ల వానలతో పంటలు నష్టపోయిన రైతులకు పారదర్శకంగా పరిహారం అందేలా నివేదికలను ప్రభుత్వానికి పంపించారా? అని ఆయన వ్యవసాయ, ఉద్యాన వన శాఖలకు చెందిన అధికారులను ప్రశ్నించారు. పంటలు నష్టపోయిన రైతులందరికి పరిహారం అందేలా చూడాలన్నారు.

రూ.2.35 కోట్ల ప్రతిపాదనలకు త్వరలో ఆమోదం

ప్రస్తుత వేసవిలో రెండు జిల్లాల్లోని గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లకు జెడ్పీ ఛైర్మన్ సూచించారు. జిల్లా పరిషత్ నిధుల నుంచి ఒక్కో జెడ్పీటీసీ సభ్యుడికి రూ.5 లక్షలు కేటాయిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 47 మంది జెడ్పీటీసీల నుంచి అందిన రూ.2.35 కోట్ల ప్రతిపాదనలకు రెండు, మూడు రోజుల్లో పాలనా అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు.

గైర్హాజరైన అధికారులకు నోటీసులు

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలకు, సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరు అవుతున్న నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారులకు నోటీసులు జారీ చేయాలని సీఈఓ జీ నాసరరెడ్డిని జెడ్పీ ఛైర్మన్ ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, స్థాయీ సంఘాల ఛైర్‌పర్సన్లు దిల్షాద్ ముజాఫర్ నాయక్, పీ దివ్య, ఆర్‌అండ్‌బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు కే నాగరాజు, కే సుబ్రమణ్యం, బీ నాగేశ్వరరావు, సీహెచ్ మనోహర్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్ శ్రీనివాసకుమార్, డీఈఓ రంగారెడ్డి, సమగ్రశిక్ష అదనపు కోఆర్డినేటర్ డా. కే వేణుగోపాల్, డీఎంఅండ్‌హెచ్ఓ డా.రామగిడ్డయ్య, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

20న క్రికెట్ జట్టుకు ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో ఈనెల 20 వ తేదీ ఉదయం 10 గంటలకు అండర్-23 పురుషుల జిల్లా జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి దేవేంద్రగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు సౌత్‌జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంటులో పాల్గొంటుందని పేర్కొన్నారు. 2000 సెప్టెంబర్ 1వ తేదీ తరువాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు నేరుగా ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

యువతి అదృశ్యం


అదృశ్యమైన యువతి

బనగానపల్లె: టంగుటూరు గ్రామానికి చెందిన గోరుగంటి శివమ్మ ఈనెల 14వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి వెంకటమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నందివర్గం ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎంఎస్సీ చదివిన శివమ్మ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ప్రైవేట్ ఫిషరీస్ ల్యాబ్‌లో ఉద్యోగం చేస్తుందని, తల్లికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఈనెల 9వ తేదీన గ్రామానికి చేరుకుందన్నారు. కాగా 14వ తేదీన బ్యాంక్ పని నిమిత్తం బనగానపల్లెకు వెళ్లి తిరిగి రాలేదని చెప్పారు. బంధువుల ఇళ్ల వద్ద కుటుంబీకులు ఆరా తీసినా ఆచూకీ లేకపోవడంతో యువతి తల్లి వెంకటమ్మ పోలీసులను ఆశ్రయించిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, ఆచూకీ తెలిసిన వారు 9121101098కు సమాచారం అందించాలని ఎస్‌ఐ తెలిపారు.

16 పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీల్లో మార్పు

- పలు పీఏసీఎస్‌లకు కొత్త ఛైర్‌పర్సన్‌లు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 16 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ముగ్గురు సభ్యుల నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీల్లో మార్పు చేశారు. కొన్ని సంఘాల్లో సభ్యులు మరణించడం, మరికొన్ని సంఘాల్లో రాజీనామా చేయడం తదితర కారణాలతో ఈ మార్పు చోటు చేసుకుంది.

కర్నూలు జిల్లాలో ఆరు పీఎస్‌సీఎస్‌లు, నంద్యాల జిల్లాలో ఆరు పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జి కమిటీల్లో మార్పులు, చేర్పులు చేస్తూ ప్రభుత్వం ఈ నెల 13న జీవో 247 జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన జీఓకు అనుగుణంగా సహకార శాఖ కమిషనర్ ఎండార్స్‌మెంటు ఇస్తే వీరు పదవీ బాధ్యతలు స్వీకరిస్తారని సహకార శాఖ అధికారులు తెలిపారు.

కర్నూలు జిల్లాలో..

- ఆలూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా హరిజన హనుమంతమ్మ.
- బెల్డోణ సొసైటీ ఛైర్‌పర్సన్‌గా యు.మల్లికార్జున, సభ్యులుగా పి.రంగస్వామి,కురువ రామాంజినప్ప.
- మద్దికెర పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ వై.శాంతన్న, సభ్యులుగా బురుజుల వీరశేఖర్, బత్తిని హరిప్రసాద్.
- కౌతాళం పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా డాట్ల క్రిష్ణంరాజు, సభ్యుడిగా బసవనగౌడు.
- సి.బెళగల్ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులుగా ఇ.నగేష్, బి.చిన్న రాముడు.
- పసుపల పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యునిగా కె.ఈశ్వరయ్య.

నంద్యాల జిల్లాలో..

- ప్యాపిలి మండలం హుస్సేనాపురం పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా అలేబాదు గ్రామానికి చెందిన మేకల బాల అయ్యన్న.
- ఇప్పటివరకు ఛైర్‌పర్సన్‌గా కొనసాగిన సీమ సుధాకర్‌రెడ్డి జిల్లా సహకార కేంద్రబ్యాంకు పాలకవర్గం సభ్యుడిగా ఉన్నారు.
- గుండుపాపల సొసైటీలో ఇప్పటి వరకు సభ్యునిగా ఉన్న జి.బాల వెంకటరెడ్డి ఛైర్‌పర్సన్‌గా నియయామకం. సభ్యుడిగా కె.సుధాకర్.
- నాగంపల్లి పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా జి.జనార్ద న్‌రెడ్డి, సభ్యులుగా తెలుగు చంద్రమోహన్, కలగొట్ల అచ్చిరెడ్డి.
- డోన్ పీఏసీఎస్‌లో సభ్యుడిగా ఉన్న తిరుమల్‌రెడ్డి ఛైర్‌పర్సన్‌గా నియామకం. సభ్యుడిగా డి.నరేంద్ర రెడ్డి.
- ప్యాపిలి పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా బోరెడ్డి రామచంద్రారెడ్డి.
- ఉయ్యాలవాడ పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ బుడ్డా విష్ణు వర్ధన్‌రెడ్డి.

వీధి ఆవుకు చికిత్స


వైఎస్సార్ పశు సంచార వాహనంలో ఆవును తరలిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కోటావీధిలో వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న ఆవులను మన ఊరు, మన గుడి-మన బాధ్యత నిర్వాహకులు గమనించి వాటిని పశు వైద్యశాలకు తరలించారు. నిర్వాహకులు శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ వీధుల్లో తిరిగే గోవు ప్లాస్టిక్ కవర్ల తిని కడుపు ఉబ్బిపోయి అవస్థలు పడుతుండటంతో వైఎస్సార్ పశు సంచార వాహనానికి ఫోన్ చేయగా వారు వాహనంలో గోవును పశువైద్యశాలకు తరలించారు.

27న టూరిజం ప్రాజెక్టులకు వేలం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ దేవస్థానాలు, పర్యాటక ప్రాంతాల్లో నిర్మించిన టూరిజం ప్రాజెక్టులను పదేళ్ల కాలపరిమితితో లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 27వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్లు జిల్లా టూరిజం అథారిటీ అధికారి విజయ తెలిపారు. కాల్వబుగ్గ దేవాలయం బస్టాపు వద్ద నిర్మించిన ఏపీ టూరిజం రెస్టారెంట్, లక్ష్మీ జగన్నాథగట్టు(లక్ష్మీపురం) వద్ద నిర్మించిన డార్మిటరీ బ్లాక్, పార్క్, ఓర్వకల్లు మండలం కేతవరం రాతిచిత్రాల వద్ద నిర్మించిన టూరిజం రెస్టారెంట్, వెల్దుర్తి మండలం బ్రహ్మగుండం దేవాలయం బస్టాపు వద్ద నిర్మించిన టూరిజం డార్మిటరీకి వేలంపాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు జిల్లా కలెక్టర్ అండ్ ఛైర్మన్ జిల్లా టూరిజం కౌన్సిల్, కర్నూలు పేర మీద రూ.10వేలు డీడీ తీసి వేలంపాటకు ఒకరోజు ముందు తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయం పక్కన ఉన్న ఏపీ టూరిజం అథారిటీ కార్యాలయంలో వేలంపాట జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 6309924034, 8332848986ను సంప్రదించవచ్చని సూచించారు.